# అర్పణ

వి. శివప్రసాద్

రోజూ ఆఫీసునుండి వచ్చే సమయానికి ద్వారానికి చేరగిలబడి తన రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తుండే రాధ స్థానం ఖాళీగా కనిపించటంతో ఆశ్చర్యం వేసింది కృష్ణారావుకు.

"రాధకు ఒంట్లో బావుండలేదా ?" అనుకొంటూ తమ వాటాలోకి అడుగు పెట్టబోయాడు.

"బాబూ కృష్ణా ? ఒక్కసారిటురా." ప్రక్క వాటాలో వుంటున్న వసంతమ్మ గారి కేకకు ఆగి, వెనుదిరిగి అటుకేసి నడిచాడు.

"ఏం పిన్నిగారూ ?" అన్నాడు.

"నాయనా ! ఈ రోజు నీ అదృష్టం బాగుండి పెద్ద ప్రమాదం తప్పిపోయింది." ఆవిడ మాటలకు త్రుళ్ళి పడ్డాడు.

"మీ రంటుంది ఎవరి గురించి ?" ఆందోళనగా ప్రశ్నించాడు.

"రాధ గురించే బాబూ! మీ బాబాయి, నేనూ సమయానికి చూసి అడ్డుపడకుంటే నిండు ప్రాణాల్ని చేతులారా తీసుకొనేది. వంటిమీద కిరోసిన్ వంపుకొని అంటించుకోబోయింది" బాధగా అందావిడ.

కృష్ణారావు అవాక్కయ్యాడు. వళ్ళంతా చెమటలు పట్టి గుండె దడదడా కొట్టుకొంది.

"పిచ్చిపిల్ల ! తన వల్ల నీ జీవితానికెంతో లోటు జరుగుతుందని తల్లడిల్లిపోతుంది. తన చావుతోనైనా నీ కింత సుఖం దొరుకుతుందని అఘాయిత్యానికి పూనుకొంది. సమయానికి మేం చూసాం గనుక ఏం జరగలేదు. నీవైనా ఆ పిల్లకు ధైర్యం చెప్పు." చెప్తుందావిడ.

కృష్ణారావు మనసు బాధతో వూగిసలాడింది. అక్కడ క్షణం నిలవలేకపోయాడు. ఆత్రుతతో తన వాటాకేసి వేగంగా కదిలాడు.

రాధ దిండులో తలదూర్చి మంచం మీద బోర్లగా పడుకొని వుంది. కృష్ణారావు మెల్లగా మంచంమీద కూర్చుని రాధను మెల్లగా స్పృశించాడు. ఆ స్పర్శను గుర్తించిన రాధ ఒక్క ఉదుటున భర్త కౌగిలిలో చేరి వెక్కిళ్ళు పెట్టింది.

దుఃఖంలో కృష్ణారావు మనసు మూగబోయింది. ఓదార్పుగా రాధ తలను నిమురుతూ అలానే కొద్దిసేపుండిపోయాడు.

"రాధా ! అగ్నిసాక్షితో ఒకసైన

1980 చక్రపాణి తృతీయ అవార్డు పొందిన కథ

మన బంధాన్ని అగ్గిపుల్లతో త్రెంచాలను కొన్నావా?" కృష్ణారావు కంఠం వొణికింది.

అతని మాటలకు రాధలో దుఃఖం కట్టలు త్రెంచుకుని పొంగింది.

"చెప్పు రాధా! నిన్ను పోగొట్టుకుని నేను జీవితాంతం ఏ ఆశతో బ్రతకగలననుకొన్నావు?" ఆవేదనగా అన్నాడు.

రాధ ఏడుస్తుందే కాని సమాధానం చెప్పలేకపోతుంది.

"రాధా! ప్రకృతిలో ఋతువులు ఎంత సాధారణమో, జీవితంలో కష్టసుఖాలూ అంతే. వాటికి అనుగుణంగానే జీవితంలో సౌఖ్యాన్ని వెదుక్కోవాలి. వృక్షానికి కాండం, వేరు ఎంత ప్రాముఖ్యమో సంసారానికి భార్య, భర్తా అంతే ప్రాముఖ్యం. ఏది వాడిపోయినా సంసారం సౌందర్యహీనమౌతుంది.... ఇదేనా నువ్వు నన్ను అర్థంచేసుకొంది?" కృష్ణారావు కళ్ళల్లో నీరు నిలిచింది.

"నా వలన మీరేం సుఖపడుతున్నారండీ! భార్యగా మీకు సేవలు చెయ్యవలసిన దానివి మీచేత నే సేవలు చేయించుకొంటున్న దౌర్భాగ్యురాల్ని." వెక్కిళ్ళు పెడ్తూ అంది రాధ.

"రాధా! నీ పరిస్థితే నాకు వస్తే సేవ చెయ్యవా?"

"వద్దండీ! నా దురదృష్టం మీకు రానేకూడదు. నేను పాపిష్ఠిదాన్ని కనుకనే దేవుడు నాకీ శిక్ష విధించాడు. ఆనాడే నేను చచ్చిపోయుంటే మీకీ క్షోభ వుండేది కాదు. నా స్మృతుల్ని మర్చిపోయి మరో పెళ్ళి...."

కృష్ణారావు రాధను పూర్తిగా చెప్పనివ్వకుండా ఆమె పెదాలను చేత్తో మూసేశాడు.

"ఆ ఆలోచనలతోనే నీవు ఈ అఘాయిత్యానికి పూనుకొన్నావా రాధా? వెన్నెల మైదానంలో నల్లదనాన్ని ఆస్వాదించినవాడెవడూ, మండే ఎడారిలో విహరించాలనుకోడు. నీ సాంగత్యం నాకు వెన్నెల మైదానం రాధా!" తన్మయత్వంగా భార్యను హృదయానికి హత్తుకొని నుదుటిని ముద్దాడాడు.

"నా బ్రతుకులో చీకటి తప్ప మీరు చూసుకోవటానికి వెలుగెక్కడ మిగిలిందండీ! ఆ వెలుగును ఎన్నడో తన గుప్పిటలోకి తీసుకొంది." భర్త తనపై చూపిస్తున్న అనురాగానికి కరిగిపోతుంది రాధ.

"రాధా! చిన్న అద్దంముక్క సైతం విశాలమైన ప్రతిబింబాన్ని తనలో ఇముడ్చుకోగలుగుతుంది. ఎంత పెద్ద కొండయినా తనపై ఒకచిన్న దృశ్యాన్ని ప్రతిబింబించుకోలేదు. ఆ రెంటికీ వున్నంత తేడానే తృప్తికి-అసంతృప్తికి మధ్య అగాధంలా నిలిచి దాంపత్యాన్ని దుఃఖమయం చేస్తుంది. కాని మన బంధం తేలికగా తెగిపోదు రాధా! నీ ఉనికి నా హృదయం మలిచే ఊహాశిల్పాలకు ఉలి



వంటిది. అందుకే నిన్ను నా నుండి దూరం కానివ్వను." అతని కళ్ళు చెమ్మ గిల్లాయి.

"నాపై మీరు చూపించే ప్రేమకు ప్రతిఫలంగా, మీ సేవకు అంకితం కాలేక పోతున్నందుకు నేనెంతో కుమిలిపోతున్నా నండీ."

"రాధా ! భౌతికాన్ని మించి, పరస్పరం మానసికంగా అంకితం కాగలిగినదే ఆదర్శమైన దాంపత్యం. భౌతిక ఆకర్షణనేది కేవలం ఒక అతుకు లాంటిదే. అది బంధాన్ని తాత్కాలికంగానే పట్టి వుంచగల్గుతుంది. మన దాంపత్యం ఆదర్శం కావాలి. నిన్ను భార్యగా పొందగలగటం నా అదృష్టంగా భావించాను. ఆ అదృష్టాన్ని నిర్దయగా దూరం చెయ్యకు." తన్మయత్వంగా కళ్ళు మూసుకొన్నాడు.

వేగంగా దూసుకొచ్చిన కడలి తరంగాలు ఒడ్డును తాకి వెనక్కుమళ్ళినట్లుగా అతని ఆలోచనలు ఉద్వేగంతో హృదయాన్ని తాకి గతంలోకి జారిపోయాయి.

తను తాలూకా ఆఫీసులో గుమస్తా. చేరి రెండేళ్ళయింది. ఆ ఉద్యోగాన్ని సంపాదించి ఒక నీడన నిలబడగలగటానికి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు.

తల్లిదండ్రులిద్దర్నీ చిన్నతనంలోనే పోగొట్టుకొన్న దురదృష్టవంతుడు తను. అనాధలా బజారెక్కాల్సిన తనను పెద్దమ్మ చేరదీసింది. తనుండటం పెద్ద నాన్నకు ఇష్టంలేకున్నా పెద్దమ్మ ఇష్టాన్ని వ్యతిరేకించలేక భరించాడు.

అక్కడే స్కూలు ఫైనల్ వరకు చదువుకో గలిగాడు. హఠాత్తుగా పెద్దమ్మ జబ్బుతో మరణించడంతో ఆ ఇంట్లో తనకు అండలేకపోయింది.

నిరాదరణతో ఇంటినుండి గెంటివేయబడ్డాడు.

స్వశక్తితో డిగ్రీ పూర్తిచేసి మంచి ఉద్యోగం సంపాదించుకోవాలనీ, నలుగురి సహాయాన్నీ అర్థించి వారాలు చేస్తూ పట్టుదలతో డిగ్రీ తెచ్చుకో గలిగాడు. ఆ తర్వాత ఒక సంవత్సరం నిరుద్యోగంతో ఎన్నో బాధలు పడాల్సివచ్చింది. కూటికి గతిలేక వస్తులున్నాడు తను.

నిరుత్సాహ పడకుండా ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. అదృష్టం కొలది గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించుకొన్నాడు. అంతవరకు తను పడ్డ కష్టాలన్నీ గట్టెక్కాయి. మనసుకు స్థిమితం చిక్కింది.

తాసిల్దారుగారితో అప్పుడప్పుడూ తను పల్లెలకు వెళ్ళాల్సి వస్తుండేది. అలాంటి సందర్భంలోనే మొదటిసారిగా రాధను చూడటం తటస్థపడింది.

ఆ రోజు అంతా జీపులో ఈశ్వరపురం వెళ్ళాల్సి వచ్చింది.

శిస్తు వసూళ్ళగురించి తాసిల్దారుగారు మనసభుతో మాట్లాడుతూ మధ్యలో తనను వివరాలు అడుగుతుంటే ఫైల్స్ అందిస్తున్నాడు.

ఒక ట్రేలో కాఫీ కప్పులు తీసుకొని తమ మధ్యకు వచ్చిందొక అమ్మాయి. చూడగానే ఎంతో సింపుల్‌గా, చక్కగా వుందనుకొన్నాడు.

"తీసుకోండి!" అంటూ కప్పు చేతి కందిస్తుంటే ఇద్దరి చూపులు కొద్దిక్షణాలు కలుసుకొన్నాయి.

ఆ కొద్ది క్షణాల వ్యవధే తన హృదయంలో సంచలనాన్ని కలిగించాయి. తనకు తెలీకుండానే అనురాగ బీజాన్ని తనలో నాటాయి.

ఆ క్షణకాలంలోనే-విశాలంగా వున్న ఆమె కళ్ళనుండి వెన్నెల ప్రవాహంలా తనను తాకినట్లుగా తన్మయుడయ్యాడు. నిర్మలంగా ప్రకాశిస్తున్న ఆ కళ్ళనే తన మనసులో ప్రతిష్ఠించుకొన్నాడు.

చంద్రుని ఆవరించిన నల్లటి మబ్బులా ఆ కళ్ళల్లో ఏదో దైన్యాన్ని గమనించ గలిగాడు.

ఆ అమ్మాయి తిరిగి వచ్చి ఖాళీ కప్పులు తీసుకెళ్తుంటే మరోసారి చూడాలని ప్రయత్నించాడు కాని తనకేసి చూడనే లేదు.

"ఎవరీ అమ్మాయి?" ఎన్నోసార్లు అనుకొన్నాడు. అక్కడున్నంత సేపు తన మనసు స్వాధీనం తప్పింది.

అక్కడే మధ్యాహ్నం కావటంతో మునసబుగారి బలవంతంమీద భోజనం చెయ్యాల్సి వచ్చింది. అందరికీ ఆ అమ్మాయే స్వయంగా వడ్డిస్తుంటే తను ఆకలి మర్చిపోయి ఆ కళ్ళల్లోకి పదేపదే చూడాలని తాపత్రయపడ్డాడు-

చురుగ్గా, ఎంతో వినయంగా పని చేస్తున్న ఆమెను చూసి, "మీ అమ్మాయేనా?" తహసిల్దార్‌గారు మునసబు గార్ని ప్రశ్నించారు.

"కాదండీ! మా ప్రక్కింటివాళ్ళ మేనకోడలు. ఈ పిల్లకు మేమంటే ఎంతో అభిమానం. చిన్నప్పుడే తల్లీ దండ్రీ పోతే మావయ్యగారింట్లోనే పెరిగింది. బంగారంలాంటి పిల్ల. ఎక్కువగా మా ఇంట్లోనే చనువుగా తిరుగుతుంటుంది. బైటకు పోతే కొడుక్కి కట్నం వస్తుందన్న ఆశతో, ఈ పిల్లను దారినపోయే ఏ దిక్కులేనివాడికో కట్టబెట్టాలని చూస్తున్నారు.... ఈ పిల్ల అదృష్టం ఎలా వుందో?" నిట్టూర్చారాయన.

ఆయన మాటలకు ఆ అమ్మాయి మీద తనెంతో జాలిపడ్డాడు. తనలా ఒక దురదృష్టవంతురా లన్నమాట! అనుకొన్నాడు సానుభూతిగా.

మునసబుగారు ఒకటి, రెండుసార్లు ఆమెను పిలుస్తుంటే, పేరు 'రాధ' ని తెలుసుకోగలిగాడు.

"రాధ!....రాధ!...."ఎంత చక్కని పేరు.

అక్కడినుండి బయల్దేరినపుడు, మరోసారి చూడాలని ఆమెకోసం తన కళ్ళు వెదికాయి. కాని మళ్ళీ కనిపించలేదు.

ఆ రోజు రాత్రి ఎంతోసేపటికి గాని నిద్రపట్టలేదు. రాధ కళ్ళు తనను వెంటాడుతున్న ట్లనిపించింది. ఆ కళ్ళలో మాటల కందని ఏదో ఆకర్షణ తన హృదయంలో కల్లోలాన్ని రేకెత్తిస్తుంది.

తను మర్చిపోదామని ఎంతగా ప్రయత్నిస్తున్నాడో, అంతగా తన మనసులో ఆ కళ్ళు ముద్రించుకుపోయాయి. ఆ ఆకర్షణకు తను దూరం కాలేక పోతున్నాడు. ఎక్కడ చూసినా ఆ కళ్ళే ప్రత్యక్ష మౌతున్నట్లున్నాయి.

ఒక స్త్రీ కళ్ళల్లో ఇంతటి ఆకర్షణ శక్తి వుంటుందని అనుభవ పూర్వకంగా తెలుసుకో గలిగాడు. ఆ ఆలోచనలే రాధను ఆరాధించటానికి ఆలంబన లయ్యాయి.

రాధను పొందలేని తన జీవితం వ్యర్థమనిపించింది. ఆమెను భార్యగా స్వీకరించ గలిగే అవకాశాన్ని జారవిడుచుకొంటే పిచ్చివాడ్నయి పోతానని భయం వేసింది.

ఓ రోజు ఒంటరిగా ఈశ్వరపురం వెళ్ళాడు. మనసబుగారు తనను సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టారు.

"ఏమండీ! తాసిల్దారుగారేమైనా కబురుపెట్టారా?" తనేం మాట్లాడకపోతే ఆయనే కదిలించారు.

"అహా! కాదండీ! నాకు.... మీతో పనుండి వచ్చాను." తొట్రుపడ్డాడు.

"నాతోనా? ఏమిటి?" ఆశ్చర్యంగా చూశారాయన.

ఆ విషయం ఎలా ప్రారంభించాలో అర్థంకాక ఒక నిమిషం మౌనంగా వుండి పోయాడు.

"మీ ఇంట్లో ఆ రోజు చూశాను.... రాధ.... అందరికీ ఇష్టమైతే నేను పెళ్ళి చేసుకొందామని అడగటానికి వచ్చాను." ఆ మాత్రం అడగటానికి చెమటలు పట్టాయి.

ఆయన నాకేసి చిత్రంగా చూసారు. అందులోనే ఏదో మెరుపు కనిపించింది.

"వాళ్ళేమీ కట్నం ఇచ్చుకోలేరు." కొద్ది క్షణాల తర్వాత అన్నారు.

"ఆ ఉద్దేశంతో నేను రాలేదు." అంటూ తన వివరాలన్నీ ఆయనకు చెప్పుకొన్నాడు.

మనసబుగారు కొద్దిసేపు ఆలోచించి, "సరే! వాళ్ళింట్లో మాట్లాడి తీసుకొస్తాను. మీరిక్కడే కూర్చోండి." లేచి బయటకు వెళ్ళారు.

కొద్దిసేపటి తర్వాత తిరిగొస్తూ ఆయన తనతో మరో వ్యక్తిని వెంట బెట్టుకొని, "వీరు రాధ మావయ్య సుబ్బారావుగారు." పరిచయం చేయగానే నమస్కరించాడు.

"మీకుగా మీరే వచ్చి రాధను చేసుకుంటా ననటం దాని అదృష్టం. మా స్థితిగతులన్నీ మనసబుగారు మీకు చెప్పే వుండాలి. కట్నంగా ఏమీ ఇవ్వలేను.

అంతేగాక ప్రస్తుతం కానీ ఖర్చుతో పెళ్ళి చేసేస్థితిలోనూ లేను." నాన్చాడు సుబ్బారావుగారు.

"ఖర్చుల గురించి మీరేం ఆలోచించ కండి. రాధను నేను చేసుకోవటానికి మీకు అభ్యంతరం లేకుంటే చాలు, సంతోషిస్తాను." చెప్పాడు తను.

ఆయన ఒక నిమిషం ఆలోచించి, మనసబుగారికి ఇష్టమైంది గనుక నే మీ ప్రస్తావన నాదాకా తీసుకొచ్చారు. వారి ఇష్టమే నా ఇష్టం.... పోతే, పెళ్ళయిన తర్వాత రాధ బాధ్యత మాకేమీ వుండదు. అన్నీ మీరే చూసుకోవాలి. నాకు ఇంకా పెళ్ళికావాల్సిన పిల్లలున్నారు." రాధను పూర్తిగా వదిలించుకోవాలన్నదే ఆయన ఆంతర్యంగా బోధపడింది

"అలాగే.... రాధ ఇష్టాన్ని కూడా మీరు కనుక్కోవటం బావుంటుంది." అన్నాడు తను.

"దాని ముఖం! దానికో ఇష్టం, అయిష్టమూనా? అదే ఒప్పుకుంటుంది." రాధ విషయంలో ఆయన కెంత నిర్లక్ష్యమో పూర్తిగా తెలిసింది.

తను నోరు విప్పబోతున్నంతలో వెంటనే మనసబుగారు అందుకొన్నారు.

"రాధను నేను ముందే అడిగాను. రాధ మనస్ఫూర్తిగా ఇష్టపడింది. ఇక ముహూర్తాలు నిర్ణయించడమే ఆలస్యం" నవ్వేరాయన.

తన మనసులో కోటిదీపాల వెలుగు. తన జీవితానికి మహత్తరమైన మలుపుగా ఆ వెలుగులో హంసలా నడిచివస్తున్న రాధ.

అనుకొన్నది పొందగలుగుతున్నా నన్న ఆనందతరంగాలలో తడిసి ఉక్కిరి బిక్కిరయ్యాను. రాధ తనది కాబో తున్నదన్న మధురానుభూతితో తనీ ప్రపంచాన్ని జయించినంతగా తృప్తి పొందాడు.

పెళ్ళయింది. తను కూడబెట్టిన కాస్త డబ్బును పెళ్ళి ఖర్చుల క్రింద సంతో షంగా ఖర్చుపెట్టాడు. మనసబుగారే పెళ్ళి పెద్ద.

మొదటి రాత్రి!

సిగ్గుల మొగ్గయిన తన హృదయాధి దేవత రాధ కౌగిలిలో బాహ్య ప్రపం చాన్నే మరిచిపోయిన మధుర వేళలో...

ఆనందంతో తడిసిన కళ్ళతో, "ఏవండీ! నాలో ఏం చూసి కోరి మీ దాన్ని చేసుకొన్నారు?" రాధ అడిగింది.

"వెన్నెల...."

"నాలోనా? ఎక్కడ?" ఆశ్చ ర్యంగా రాధ.

"నీ కళ్ళల్లో!"

మధురంగా నవ్వింది రాధ.

"నాకీపాటి భాగ్యం లభిస్తుందని కలలో కూడా ఊహించలేను." తన్మయు రాలై రాధ.

"ఏపాటి?"

"ఈపాటి...." తన హృదయంలో తల దాచుకొంటూ రాధ.

"రాధా! ఇంతవరకు జీవితంలో కష్టాలే చవిచూశాను....నీవు నా జీవితం లోకి దేవతలా నడచి వచ్చిన క్షణాలు మర్చిపోలేనివి. నే నెంతో అదృష్టవం తుడ్ని."

"కాదు.... నేనే అదృష్టవంతురాల్ని."

"పోనీ... మనిద్దరం." రాధ నుదుటిని ముద్దాడాడు.

అంతలోనే రాధ కళ్ళల్లో నీరు సుడులు తిరిగి బుగ్గలమీదుగా జాలు వారాయి.

"రాధా! ఏమిటిది?"

"జీవితంలో ఇంతకాలం పడిన కష్టా లకు వీడ్కోలుగా కడసారి అశ్రు బిందువులండీ! మీ సాన్నిధ్యంలో ఇక నాకే దుఃఖమూ వుండదన్న నిశ్చింత." రాధకంఠం రుద్ధమయింది.

"రాధా! జీవన కడలిలో ఆధారం దొరకక ఇంతకాలం ఈదుతూ, అలసి పోయిన మనను ఈ దాంపత్య నౌక వెలుగుతీరాలకు చేర్చాలి-" మత్తుగా రాధను గట్టిగా హత్తుకున్నాడు.

"మీరు వెలిగించిన ఈ దీపం మీకే అర్పితం." రాధ పెదాలు కంపిస్తున్నాయి.

"రాధా! రాధా! రా....ధా!" రాధ పెదాలను తన పెదాలు మూసేశాయి. కాలం కరిగిపోయింది.

రాధకు దూరంగా వున్న ప్రతిక్షణం ఒక గడియలా, రాధ చెంతనున్న ప్రతి గడియ ఒక క్షణంలా దాదాపు సంవ త్సరం గడిచిపోయింది.

మనసబుగారి ఇంట్లో పెళ్ళికి తమకు ఆహ్వానం అందింది. ఆఫీసు పనిఒత్తిడి వలన తనకు వెళ్ళే వీలులేకపోయింది. రాధ నొక్కదాన్నే పంపాల్సి వచ్చింది.

"రాధా! వెంటనే వచ్చేస్తావుగా?" దిగాలుగా తను.

"ఆఁ! ఎన్నాళ్ళేనా? వారంలో రానూ!" ఉడికిస్తూ రాధ.

"అమ్మో! ఏడు యుగాలు నిన్నిడిచి వుండగలనా?"

"మీరు వస్తే ఏడు క్షణాల్లా గడిచి పోతాయి." కొంటెగా నవ్వింది.


"మాటలు నేర్చావు!"

"మన పెళ్ళయి సంవత్సరం అయింది మరి!"

"ప్లీజ్! రాధా! రెండు రోజుల్లో వచ్చెయి. నీవు లేకుంటే పగలూ చీకటీ .... ఆ బాధ నే పడలేను." బిక్క మొగం వేసేసరికి రాధ పకపకా నవ్వింది.

"సరే! పెళ్ళయిన రెండో రోజు సాయంత్రానికల్లా వచ్చేస్తాను." జాలి పడింది రాధ.

"మై స్వీట్! వీలుంటే ఆరోజే రా- నీ కోసం బస్‌లు లెక్కిస్తూ కూర్చుం టాను." గభాల్న కౌగలించుకొని గట్టిగా ముద్దు పెట్టుకొన్నాడు తను.




"అబ్బా !.... ఎప్పుడూ ఎరగనట్టే!" చిరుకోపంగా అంది.

"నీ వచ్చేవరకు రాత్రిళ్లు దీన్నే నెమరు వేసుకొంటాను." కొంటెగా అన్నాడు తను.

బస్టాండు వరకు వెళ్ళి రాధను బసెక్కించి వచ్చేశాడు తను. బస్ కదులుతుంటే రాధ ఏదో పరాయిదేశం వెళ్తున్నట్లుగా అనిపించింది.

ఆ ప్రయాణమే తమ హృదయాల్లో చిచ్చు రగిల్చింది. పెళ్ళయిన రెండో రోజే రాధ బయల్దేరింది. ఆ ఊరుకు బస్‌లు తక్కువ. రెండు మూడు గంటలకు ఒకటిగాని పైనుండి రాదు. ఆ రోజు బస్‌లన్నీ పైనుండే రద్దీగా వుండటం వలన ఆ ఊరిలో ఆపటంలేదు.

చీకటిపడుతుంది. ఆ రోజు ప్రయాణం వాయిదా పడకూడదన్న ఆత్రుతలో అటుగావస్తున్న టెంపోలో ఎక్కేసింది. మధ్య దారిలో అది తలక్రిందులై రోడ్డు ప్రక్కనున్న అగాధంలో పడిపోయింది. ఆ ప్రమాదంలో ఒకరు అక్కడే చచ్చిపోయారు. మిగతా వాళ్ళంతా హాస్పటల్‌లో చేర్చబడ్డారు.

ఆ మర్నాడు మధ్యాహ్నం తనకు కబురంది హాస్పటల్‌కు పరుగెత్తాడు. బెడ్ మీద బాధతో మూలుగుతూ రాధ.

తలచుట్టూ, కళ్ళచుట్టూ తెల్లటి బేండేజి. ఆ గుడ్డకు అంటుకొని ఎర్రగా ఆరీఆరని రక్తం. ఆ స్థితిలో రాధను చూసి తన హృదయం ద్రవించుకుపోయింది.

"రాధా !.... రాధా !...." మంచం ప్రక్కనే కూర్చొని ప్రేమగా తడిమాడు.

తన స్పర్శను గుర్తించింది. చేతులతో తడిమింది.

"ఇక మీరొచ్చారు. నాకేం భయం లేదు." రాధ కంఠంలో ధైర్యం.

"ఎలావుంది రాధా ?"

"తల కాస్త పోటుగా వుందంతే." శుష్కంగా నవ్వింది. రాధ బాధను అణిచిపెడ్తున్నట్లు తనకు తెలుస్తూనే వుంది.

తన చేతుల్లోనే మగతలోకి జారిపోయింది.

"డాక్టర్ ! నా రాధ పరిస్థితి ఎలా వుంది ?" డాక్టర్ని కలిశాడు.

"ప్రాణానికేం ప్రమాదం లేదు. కాని చూపు పోతుందేమోనని అనుమానంగా వుంది." డాక్టర్ మాటలకు తల్లడిల్లి పోయాడు.

రాధకు చూపు పోగొట్టవద్దని రోజూ భగవంతుడ్ని వేడుకొన్నాడు. రాబోయే ఫలితాన్ని గురించిన ఆలోచనలతో రాత్రుళ్ళు నిద్రపట్టేదికాదు.

గాయాలు తగ్గగానే రాధ కట్లు విప్పారు.

"చూడమ్మా ! మెల్లగా కళ్ళు విప్పి చూడు."డాక్టర్ చెప్పగానే రాధ మెల్లగా కళ్ళు విప్పింది.

ఊపిరి బిగపట్టి రాధకేసి చూస్తుండిపోయాడు. రాధ ఒక్కసారిగా పిచ్చిదానిలా అరిచింది.

"చీకటి ? చీకటి !.... నాకేం కనపడటం లేదు." రాధ బావురుమని ఏడ్చింది. తనకు దుఃఖంలో మాట రాలేదు.

ఒక్కసారిగా రాధను కౌగిలిలోకి తీసుకొని బాధగా తన హృదయానికి హత్తుకొన్నాడు. ఓదార్చటానికి మాటలే రాలేదు. గుండె పగిలేలా ఏడుస్తున్న రాధను చూస్తూ తను మౌనంగా రోదించాడు.

"డాక్టర్ ! రాధకు ఇక చూపే రాదా?" రాధను ఇంటికి తీసికెళ్ళబోతూ అడిగాడు.

"మిస్టర్ కృష్ణారావు ! రెటీనా, నర్వ్ ఎండిగ్స్ దెబ్బతినటం వలన ఆమె చూపు పోయింది. ఆపరేషన్ జరిగితే చూపు రావచ్చు." ఆయన మాటలకు తన ప్రాణం లేచివచ్చినట్లయింది.

"థాంక్యూ డాక్టర్ !.... అందుకు ఎంత ఖర్చవుతుందంటారు ?"

"సుమారు పదివేలు కావచ్చు ! వెంటనే మాత్రం ఆపరేషన్‌కు వీలుపడదు." ఒక్కసారిగా తనూ నీరుగారి పోయాడు.

అంత డబ్బు తనదగ్గ రెక్కడిది ? ఎన్నాళ్ళు కూడబెడితే అంత సమకూర్చగలడు ? అంతవరకు రాధనెలా సముదాయించాలి ?

రాధను తీసుకొని ఇంటి కొచ్చాడు.

రాధలో వెనుకటి ఆనందం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ విరాగిలా కూర్చొంటుంది.

"రాధా! డాక్టర్ నీకు చూపు వస్తుందని చెప్పారు. త్వరలోనే నీకు ఆపరేషన్ చేయిస్తాను." రాధను ఓదార్చుతుండే వాడు.

అపుడు రాధ ముఖంలో వెలుగు కనిపించేది. ఆ తర్వాత మళ్ళీ నిర్లిప్తంగా ఉండిపోయేది.

నెలలు గడిచిపోతూ సంవత్సరం దాటింది. ఆపరేషన్‌కు అవుతుందన్న ఖర్చులో ఒక వంతుకూడా తను కూడబెట్టలేకపోయాడు,

మళ్ళీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి పరీక్ష కూడా చేయించలేకపోయాడు. రాధలో తనకు చూపు వస్తుందన్న ఆశ సన్నగిల్లుతుందేమోనని భయం వేస్తుందేది.

పుట్టుగుడ్డివాడు చీకటికి అలవాటు పడుతాడు గనుక దాన్ని తేలిగ్గానే భరించగలడు. కాని మధ్యలో గుడ్డితనం వస్తే చీకటిని భరించలేక మానసికంగా బలహీనుడైపోతాడు.

రాధ విషయంలో అదే జరిగింది. అందుకే ఈ ఘోరానికి తలపడింది. ఏ శక్తో రాధను తనకు దక్కించింది. లేకుంటే జీవితాంతం తను కళ్ళుండీ గ్రుడ్డివాడయ్యేవాడు.

"ఏమండీ! నిజంగా డాక్టర్ నాకు చూపు వస్తుందనే చెప్పారా?" రాధ ప్రశ్నకు కృష్ణారావు ఆలోచనలు తెగి ఉలిక్కిపడ్డాడు.

"నిజం రాధా! అలాగని అబద్ధం చెప్పి ఇంతకాలం వంచన చేస్తున్నాననుకొంటున్నావా? నీకు తప్పక ఆపరేషన్ చేయిస్తాను." నమ్మకంగా చెప్పాడు కృష్ణారావు.

"ఆ ఆశే నన్ను బ్రతికిస్తుందండీ? నాకు చూపు రావాలి. మీ సేవలతో నా జీవితం తరించాలి. నా సాన్నిధ్యంలో మా కలలనన్నీ భార్యగా పండించాలి. లేకుంటే మనశ్శాంతి వుండదండీ." రాధ కళ్ళు వర్షిస్తున్నాయి.

రాధ కన్నీళ్ళు తుడిచాడు.

"రాధా! నీ కళ్ళు చంద్రుడిన్ని మించిన వెలుగుగోళాలు. ఆ వెలుగును తాత్కాలికంగా విధి చీకటి తెరలను కప్పింది. ఏలాగైనా ఆ వెలుగు తిరిగి చీకటిచి చీలుస్తుంది. అందుకు కొంత కాలం నాకు అవకాశం ఇవ్వు. అంతే గాని మనసు వికలం చేసుకోకు." కన్నీళ్ళతో అభ్యర్థించాడు కృష్ణరావు.

* * *

ఆపరేషన్‌కు అయ్యే డబ్బుకోసం ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తూనే వున్నాడు—కాని అతని ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు ఏవో ఆటంకాలు వస్తూనే వున్నాయి. రోజులు గడుస్తూనే వున్నాయి.

రాధ కొన్నాళ్ళు ఉత్సాహంగా కనిపించినా తిరిగి వెనుకటి పరిస్థితికి వస్తున్నట్లు తోస్తుంది. రోజురోజుకు శుష్కించి పోతున్నట్లుంది. నిరాశ ఆమెను లోలోన దహించివేస్తూ రాధను తనకు దూరం చేస్తుందేమోనన్న భయం పీడిస్తుంటే కుమిలిపోతున్నాడు.

ఆఫీసులో ముఖ్యమైన స్నేహితుల్ని ఒకరిద్దర్ని డబ్బు సర్దమని అడిగితే మొండిచేతులు చూపించారు.

జనార్ధన్ మాత్రం, "కృష్ణారావు! నీ సీటు విలువ నీకు తెలియదు. నీవు కావాలనుకొంటే పదిరోజుల్లో పదివేలు సంపాదించి పెడ్తుంది. ఒకవేళ నేను అంత డబ్బు ఇచ్చినా తీర్చటం నీవల్ల కాదు. నువ్వు 'ఊ' అంటే అంతా నేను చూసుకొంటాను. ఫిఫ్టీ-ఫిఫ్టీ.... నెల రోజుల్లో ఆ డబ్బు నేను అందిస్తాను." ఓ క్రొత్తదారి చూపించాడు.

ఆ మార్గం అతని కెంతో అసహ్యమనిపించింది. అలాంటి సలహా ఇచ్చినందుకు జనార్దన్ తిట్లు తినాల్సివచ్చింది. కృష్ణారావు చేతగానివాడుగా నలుగురితో చెప్పుకొని తన కసి తీర్చుకొన్నాడు.

"ఆ పాపిష్టి డబ్బుతో రాధకు చూపు తెప్పించి, ఆమె పవిత్ర ప్రేమను తను కలుషితం చేయలేడు.... తను ఎంత త్యాగమైనా చేసి రాధకు చూపు తెప్పించాలి. వెనుకటిలా రాధ జీవితంలో వసంతం రావాలి. కోకిలలు గానం చేయాలి." ఆలోచిస్తున్నాడు రోజూ.

అందుకు తనేం చెయ్యాలి???

రోజూ కంటిమీద కునుకులేకుండా తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు.

పవిత్ర ప్రేమపై విధి విసిరిన సవాలుకు పేదరికం ఓడిపోకూడదు. ప్రేమ జయించాలి. విధి ఓటమితో సిగ్గుపడాలి.

ఎలా? ఎలా?

"రాధా! నేను ఆఫీసు పనిమీద కాంపు వెళ్తున్నాను. తిరిగి రావటానికి నెల పట్టవచ్చు." బయల్దేరబోతూ చెప్పాడు కృష్ణారావు.

"నెలరోజులే! అంత కాలం మీరు లేకుండా నేనెలా వుండగలనండీ!.... తప్పక వెళ్ళాల్సిందేనా?" దుఃఖంగా అంది రాధ.


"వెళ్ళక తప్పదు రాధా! పిన్నిగారితో అంతా చెప్పాను. ఈ నెలనాళ్ళు అన్నీ ఆమె చూసుకొంటారు. ధైర్యంగా వుండు." కౌగిలిలోకి తీసుకొని బుజ్జగించాడు.

"ముప్ఫయి రోజులంటే నాకు ముప్పయి యుగాలండీ! వీలయితే ముందే వచ్చెయ్యకూడదూ?"

"నాకు మాత్రం నిన్నిలా ఒంటరిగా వదలి వెళ్ళటం బాధ కాదా రాధా? కాని తప్పదు.... ఒక ముఖ్య విషయం చెప్పనా?"

"ఏమిటి?"

"నేను రాగానే నీకు ఆపరేషన్ చేయిస్తాను. నిన్ననే డాక్టర్‌తో మాట్లాడి వచ్చాను."



రాధ ముఖంలో వెలుగు కనిపించింది. రాధ కన్నీళ్ళు తుడిచి వెళ్ళలేక వెళుతున్నట్లే తనూ ప్రయాణానికి సిద్ధపడ్డాడు. వసంతమ్మగారికి రాధను గురించి పదేపదే చెప్పి వెళ్ళిపోయాడు.

* * *

కృష్ణారావు తిరిగి వచ్చేసరికి నెల దాటింది. ఆ నెల రోజులూ రాధ ధ్యాసంతా అతనిమీదే. రోజులు లెక్కిస్తూ కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తూనేవుంది.

కృష్ణారావు రాగానే చంటిపిల్లలా అతన్ని పెనవేసుకొని ఎంతో ఆనందపడి పోయింది. రాధను కౌగిలిలో ఇముడ్చుకొని అతనూ కాలాన్ని మర్చిపోయాడు.

"ఇక ముందెప్పుడూ ఇన్ని రోజులు కాంపు వెళ్ళకండి.... ఈ సారి వెళ్తే పిచ్చెక్కిపోతుంది."

"నాకు మాత్రం బాధ కాదూ! ఉద్యోగం తీసివేస్తానన్నా సరే, ఇక ముందు వెళ్ళను. సరేనా!" రాధకు చక్కిలిగింతలు పెట్టాడు.

"నీకు వెళ్ళేముందు ఒక సంగతి చెప్పాను. గుర్తుందా?"

"ఏ సంగతి?"

"నీకు ఆపరేషన్ చేయిస్తానని...."

రాధ మౌనంగా వూరుకొంది.

"రేపే హాస్పటల్‌కు వెళ్ళాలి. నీకు ఆపరేషన్ చేస్తారు. తప్పక చూపు వస్తుంది.... అప్పుడు చక్కగా మనం దాగుడుమూతలాడుకోవచ్చు." నవ్వేశాడు మెల్లగా.

రాధ అతని వక్షంమీద తలానించి మౌనంగా వుండిపోయింది. ఆ రాత్రి నిద్రించే వరకు రాధకు ఏవో తమాషా కబుర్లు చెప్తూనే వున్నాడు.

మర్నాడే హాస్పటల్‌లో జాయిన్ చేశాడు రాధను. జేరిన మూడోరోజే ఆపరేషన్ జరిగింది. చూపు తప్పక వస్తుందన్న ఆశను వ్యక్తంచేశాడు డాక్టర్.

ఎప్పుడూ బెడ్ దగ్గిరేవుండి కృష్ణారావు రాధకు పరిచర్యలుచేస్తున్నాడు. కాలక్షేపంకోసం ఎన్నోకబుర్లు చెప్తున్నాడు.

రోజురోజుకు రాధలో మార్పు వస్తోంది. ఆమెలో వెనుకటి నిర్లిప్తత క్రమేణా దూరమౌతోంది. సూర్యోదయానికి సంకేతంగా తూర్పు దిశ ఎర్రబారినట్లుగా, ఆమె ముఖంలో సంతోషరేఖలు విచ్చుకొంటున్నాయి.

"ఏమండీ! నాకు చూపు తప్పక వస్తుంది కదూ!" పదేపదే అడుగుతుంది.

"తప్పక వస్తుంది రాధా! గ్రహణం విడిచిన చంద్రునిలా నీ కళ్ళలో వెన్నెల విరుస్తుంది. ఆ వెన్నెలలో నేను తరిస్తాను."కృష్ణారావులో తన్మయత్వం.

డిమ్‌లైట్‌లో రాధ కట్లు విప్పారు.

"రాధగారూ! మెల్లగా కళ్ళు విప్పి చూడటానికి ప్రయత్నం చేయండి." డాక్టర్ చెప్పాడు.

వెలుగును కప్పిన కవాటాల్లా కనురెప్పలు విచ్చుకొన్నాయి. ఆ కళ్ళల్లో జీవాన్ని చూడగలిగాడు కృష్ణారావు. రాధ కనురెప్పలు టపటప లాడిస్తుంటే వెన్నెల తనను ముంచెత్తినట్లుగా అనుభూతి చెందాడు.

"నాకు మసక మసగ్గా అంతా కనిపిస్తుంది.... నేను చూడగ....లు....గు...తున్నానండీ." చిన్న పిల్లలా సంతోషపడుతుంది రాధ.

కృష్ణారావు గుండెలో కోటిదీపాలు వెలిగినట్లనిపించింది. ఆనందంతో అతనికి నోట మాట పెగల్లేదు.

డాక్టర్ క్రమేణా గదిలో వెలుతురు పెంచారు. ఆ వెలుగులో అంతా స్పష్టంగా చూడగలుగుతున్న రాధ ఆనందానికి అవధులు లేకపోయాయి.

"మిస్టర్ కృష్ణారావు! షి విల్ బి ఆల్‌రైట్!" అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

"థాంక్యూ సార్! నా రాధ కళ్ళకు వెలుగిచ్చారు. మీ మేలు జన్మలో మర్చిపోలేను." చేతులు జోడించాడు కృష్ణారావు.

డాక్టర్ చిరునవ్వుతో కృష్ణారావు భుజం తట్టి బయటకు నడిచాడు.

ఒక్కసారిగా రాధ చూపులు కృష్ణారావును ఆపాదమస్తకం తడిమాయి. మాటలతో వ్యక్తంచెయ్యలేని ఆనందంతో ఆమె హృదయం నిండిపోతుంటే హృదయ స్పందన వేగం హెచ్చింది.

ఎంతో చెప్పాలనుకొంటున్నా, ఏమీ చెప్పలేని స్థితిలో ఆమె పెదాలు ప్రశంసిస్తున్నాయి. కృష్ణారావు మెల్లగా నడచి బెడ్‌మీద కూర్చున్నాడు.

రాధ గభాల్న కృష్ణారావును కౌగలించుకొని అతని వక్షంలో తలదాచుకొంది. ఆమె కన్నీళ్ళతో అతని వక్షం తడిసిపోతుంది. రాధ వీపు చుట్టూ చేతులుంచి మెల్లగా నిమురుతుండిపోయాడు.

"ఏమండీ! నాకు పునర్జన్మ ప్రసాదించారు. ఇంతకాలం చీకటి జీవితాన్ని గడపలేక, అశాంతితో మీ మనసును ఎంతో నొప్పించాను. అంతులేని మీ ప్రేమ పరిచర్యలతో నన్ను ఋణగ్రస్తురాల్ని చేశారు. జన్మ జన్మలకు మీదాన్నిగా సేవ చేసుకొంటాను. అందుకోసం ఆ భగవంతుడ్ని రోజూ పూజిస్తాను." భర్తతో చెప్పగలుగుతున్నాననే భావిస్తుంది రాధ.

పైకి వినపించకున్నా, ఆమె హృదయం నుండి అవ్యక్త భావలహరి నిశబ్దంగా కృష్ణారావు హృదయంలోకి ప్రసరిస్తూనే వుంది.

గుడ్డిదానిగా బ్రతకలేక, చూపు రావాలన్న ప్రగాఢమైన కోరికతో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు గురించి అంతకు ముందు ఆలోచించలేకపోయింది రాధ. ఆ డబ్బు కోసం భర్త ఎన్ని కష్టాలు పడ్డారోనన్న ఆలోచన మనసులోకి రాగానే ఉలిక్కిపడింది రాధ.

ఆ విషయం కృష్ణారావును అడగాలని మెల్లగా తలెత్తి అతని ముఖంలోకి చూసింది. అతని చెక్కిళ్ళమీదుగా జాలువారుతున్న కన్నీటి బిందువులు ఆమె ముఖంమీద పడ్డాయి.

రాధ భర్త కళ్ళలోకి పరీక్షగా చూసింది. అనుమానంతో కళ్ళు విశాలం చేసి మరీ చూసింది. అతని ఎడమకన్ను పొడిగా కనిపించింది. అది కన్నీటిని స్రవించటంలేదు. నిశ్చలంగా, నిర్జీవంగా మెరుస్తున్న ఎడమ కన్నును చూసి ఒక్కసారిగా రాధ తుళ్ళిపడింది.

అది గాజు కన్ను.

———